క్లుప్తంగా

మినీ గ్రంథాలయం పరిశీలన

చాపాడు : మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె గ్రామంలో ఏర్పాటైన మినీ గ్రంథాలయాన్ని సోమవారం మండల గ్రంథాలయ శాఖాధికారి శివశంకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ప్రభుత్వం మినీ గ్రంథాలయాలను సైతం ఏర్పాటు చేస్తోందన్నారు. మండల కేంద్రాలకు రాలేని ప్రజలకు మినీ గ్రంథాలయాల్లో దిన పత్రికలతో పాటు వివిధ రకాలైన వార, పక్ష, మాస, కథల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీడీసీ రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన పిచ్చోళ్ల సుబ్బరాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుంగా సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు అతని వద్ద నుంచి 45 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్‌పీ కొండారెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అన్నవరం గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. పిచ్చోళ్ల సుబ్బరాయుడు మద్యం బాటిళ్లు విక్రయిస్తుంగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు పాస్‌లు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో సోమవారం ఆల్ ఆఫ్ యూ దివ్యాంగులు, వయో వృద్ధుల సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా బస్సు పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ దాత అబ్దుల్ రషీద్ సహకారంతో ఒక్కొక్క బస్సుపాస్‌కు రూ.110 చొప్పున 20 మంది దివ్యాంగులకు పాస్‌లు అందించినట్లు తెలిపారు. 50 శాతం రాయితీతో బస్సుల్లో దివ్యాంగులు ప్రయాణించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, అబ్దుల్ రషీద్, యదార్థుడు, కొండమ్మ లక్ష్మి, సూరయ్య, మహేష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు రావడం పట్ల ప్రొద్దుటూరు పద్మభూషణ్ మెగా స్టార్, పవర్ స్టార్ ఫ్రెండ్స్ సేవా సమితి ఆధ్వర్యంలో వాత్సల్య అనాథాశ్రమంలో సోమవారం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నటుడు దావూద్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి స్వయం కృషితో ఎదిగారని, ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సేవా సమితి పట్టణాధ్యక్షుడు రామారావు, అభిమానులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ బీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ ఉప కమిషనర్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ జారీ చేశామని, ఆసక్తిగల భక్తులు 20 రోజుల్లో కర్నూలులోని దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 430 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో కంటి అద్దాలు అవసరమైన 247 మందికి సోమవారం కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎంఎస్ తేజ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, సీహెచ్‌ఓ గంగాతులసీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

దువ్వూరు : డ్వాక్రా రుణమాఫీకి సంబంధించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీని మంగళవారం మండల కేంద్రమైన దువ్వూరులోని సీవీవీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అగ్ని ప్రమాద స్థలం పరిశీలన

ప్రొద్దుటూరు : స్థానిక ఆకృతి షోరూంలో జరిగిన అగ్ని ప్రమాద విషయం తెలుసుకుని మున్సిపల్ వైస్ చైర్మన్‌పాతకోట బంగారు మునిరెడ్డి సోమవారం సంఘటన స్థలం వద్దకు వెళ్లారు. షోరూం యజమాని తాండవ కృష్ణతో మాట్లాడారు. సంఘటన ఎలా జరిగింది, ఏ మేరకు నష్టం వాటిల్లిందని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

మహిళాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మహిళాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తే, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో పథకాలను మహిళల కోసం అమలు చేశారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా చివరి విడత సాయాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హామీ ఇచ్చి మోసం చేసింది ఎవరు? ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నది ఎవరని మహిళలు ఆలోచించాలని కోరారు. 2014 ఎన్నికల సమయంలో బ్యాంకులో ఉన్న రుణాలను మాఫీ చేస్తామని డ్వాక్రా మహిళలకు చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. ఇందుకు సంబంధించిన అప్పటి చంద్రబాబు ప్రసంగాన్ని వినిపించారు. ఆ హామీని చంద్రబాబు నెరవేర్చలేదని విమర్శించారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలు బ్యాంకులకు బకాయి ఉన్న రూ.25,571 కోట్లను నాలుగు విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నాలుగు విడతల్లో చెల్లించిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. మైదుకూరు మండలంలో రూ.40 కోట్ల బకాయిలు ఉండగా విడతకు రూ.10కోట్లు చొప్పున డ్వాక్రా మహిళల అకౌంట్లలో జమ చేశారని తెలిపారు. రైతులను, నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని కొనియాడారు. వారి కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నో విధాలా ఆదుకున్నారని పేర్కొన్నారు. రెండు లక్షల మందికి పైగా నిరుద్యోగులకు సచివాలయాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. పింఛన్ సొమ్మును రూ.3వేలు వరకు పెంచుకుంటూ పోతామని హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ ఈ జనవరి నుంచి నెరవేరుస్తూ, పింఛన్ సొమ్మును రూ.3వేలు చేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 45–60 ఏళ్లలోపు మహిళలకు చేయూత కింద రూ.18,500 ఇస్తున్నారని తెలిపారు. పిల్లలను చదివించే తల్లిదండ్రులకంటే వైఎస్ జగన ఎక్కువ ఆలోచించి వారి భవిష్యత్తు బాగుండాలని అమ్మ ఒడి పథకం కింద రూ.15వేలు ఏటా వారి అకౌంట్లలో వేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఎవరికి ఒక సెంటు స్థలం ఇవ్వలేదని, సీఎం జగన్ 33 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడమేగాక, పక్కా ఇళ్లను మంజూరు చేశారన్నారు. ఇప్పుడు ఆ ఇళ్ల పట్టాలను ప్రభుత్వ ఖర్చులతో రిజిస్ట్రర్ చేయిస్తున్నారని తెలిపారు. పథకాలు కొనసాగాలంటే వాటి ద్వారా లబ్ధి జరగాలంటే రాబోవు ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ గెలవాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ మహిళా సాధికారత కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి లేడని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వైకేపీ ఏపీఎంలు సుజాత, గూగూడు, మెప్మా టీఐ మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మైదుకూరులో అవగాహన ర్యాలీ

మైదుకూరు : ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్ రావు తెలిపారు. మైదుకూరులో సోమవారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా 'యువశక్తి ద్వారా సామాజిక మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని మైదుకూరు అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కడప రోడ్డు నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంవీఐ శేఖర్ రావు మాట్లాడుతూ వాహనాలను వేగంగా నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలు జరగవని అన్నారు. వాహనాలలో ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచికలను గమనించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనాలలో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : వాహన డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకొకసారి తప్పనిసరిగా కంటి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో వాహనడ్రైవర్లకు కంటి వైద్య నిపుణులు ఎస్.జయశంకర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ కంటిచూపు సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే డ్రైవర్ వ్యక్తిగత విషయాలను పక్కనపెట్టి వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ వాహనాల డ్రైవర్లు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : నూతన మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈయన గుంతకల్ నుంచి ఇక్కడికి రాగా, ఇక్కడి పనిచేస్తున్న వెంకటరమణయ్యను గుంతకల్‌కు బదిలీ చేశారు.


జబ్బార్ మియా

మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బి.జబ్బార్ మియా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలన అధికారిగా ఉన్న జబ్బార్ మియా మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న వై.రంగస్వామి తిరిగి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా వెళ్లారు. కాగా ఎంపీడీఓల బదిలీల్లో మైదుకూరు ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి కర్నూలుకు బదిలీ అయ్యారు.

కమిషనర్ సేవలు మరువలేనివి


బదిలీపై వెళుతున్న మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా కె.వి.కృష్ణారెడ్డి అందించిన సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన కె.వి.కృష్ణారెడ్డిని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, బి.కోడూరు వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చాపాడు : మండలంలోని పల్లవోలు, ఖాదర్‌పల్లె, సీతారామాపురం గ్రామాల్లో దెబ్బతింటున్న వరి పంట పొలాలను సోమవారం కడప ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ శ్రీనివాసాచారి, సైంటిస్టులు భగవతి, ప్రియ పరిశీలించారు. రబీలో సాగైన వరి పంట ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. పైరులో 2 సెం.మీ నీటిని నిల్వ ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లో నీటిని తీసేయరాదని, సత్వర నివారణకు పై పాటుగా చలేటెడ్ జింక్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి, పాలీసీడ్(19–19–19) 10 గ్రాములు 1లీటరు నీటికి కలిపి రెండు మూడు సార్లు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్సీ డీడీఏ రమణారెడ్డి, ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ, మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ మ్యాగీ, వీఏఏలు గోపిరామ్, గిరిధర్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఇంటి స్థలాలు లేని అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు రవికుమార్, వికలాంగుల సంఘం నాయకులు రఫి, ఖదీర్, శ్రీను, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృత్తినైపుణ్య కోర్సులపై అవగాహన

కలసపాడు (కాశినాయన) : కాశినాయన మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా సోమవారం కడపలోని కెఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఐటీ, ఎలక్ట్రానిక్ కోర్సులు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై కళాశాల యాజమాన్యం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య మాట్లాడుతూ ఒకేషనల్ టెక్నికల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వృత్తివిద్య ఉపాధ్యాయులు భవాని శ్రీనివాస్, సయ్యద్ మదార్‌సాహెబ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్లొమో ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లొమో సెకెండియర్ మూడో సెమిస్టర్, థర్డ్ ఇయర్ ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో సీబీఐటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెకెండియర్‌లో సీఎంఈ విభాగంలో టి.ముబారక్ 98.22%, వెంకట మోక్షిత్, వెంకట లక్ష్మీ మైత్రేయ 95.66%, రేవతి లక్ష్మీ 95.22%, ఈసీఈ విభాగంలో ఐ.శ్రావణ్ కుమార్ 95.40%, గంగ భవానీ 91.50%, వై.శివ మౌనిక 94.50%, వి.జ్యోత్స్న 92.20%, ఉదయ్ కిరణ్ 84.75%, లక్ష్మీసాయి చరణ్ 91.60%, థర్డ్ ఇయర్ ఈసీఈలో చంద్ర వర్షిత 95.60%, వెంకట ధరణి, పి. సంధ్య, ఎస్, అంజుం 95.40%, ఏ.సునంద 94.20%, ఈఈఈలో ఎం.శశాంక్ కుమార్‌రెడ్డి 93.90%, జి.సాయి 91.27శాతం మార్కులతో తమ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ప్రొద్దుటూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా మనోహర్, ఉపాధ్యక్షులుగా బాలనరసింహులు, రఘురాముడు, మండల కార్యదర్శిగా బాలయ్య మాదిగ, మండల ప్రచార కార్యదర్శులు ఓబులేసు, జయచంద్ర తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణం మాదిగ, బాలలక్షుమయ్య, చెన్నమ్మ, నరసింహులు మాదిగ, గంగులయ్య, బాల సంజమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి హామీ అమలు

- మాట తప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే
- రూ.5.35 కోట్ల ఆసరా మెగా చెక్కు పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ సమన్వకర్త నాగిరెడ్డి
- చాపాడులో వైభవంగా వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు


సీఎం చిత్ర పటానికి మహిళలతో కలసి పాలాభిషేకం చేస్తున్న నాగిరెడ్డి

చాపాడు : జగనన్న పాలనలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేశారు. రెండు నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయని.. 2014–19 మధ్య ఐదేళ్లలో ప్రజలను నిలువునా మోసం చేసిన టీడీపీ నాయకులు మరోసారి మోసం చేసేందుకు ఇళ్ల వద్దకు వస్తే మీ పరిపాలనలో ఏమి చేశారని ప్రశ్నించాలని వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 762 స్వయం సహాయక సంఘాలకు రూ.5.35 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శెట్టిపల్లె నాగిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈయన పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రెండు నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మళ్లీ సీఎం జగన్‌ను గెలిపించుకుంటే పథకాలన్నీ అందుతాయన్నారు. చంద్రబాబు డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని చెప్పి మోసం చేస్తే సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం 4 విడతల్లో రుణాలు మాఫీ చేశారన్నారు. అబద్ధపు హామీలతో ఓట్లు అడిగే టీడీపీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పాలనలో డ్వాక్రా రుణాలు మాఫీ, అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, చేదోడు, వసతి దీవేన, విద్యా దీవేన, పింఛన్ కానుక, కాపు నేసోతం, ఈబీసీ నేస్తం, పేదలందరికీ ఇళ్లు, పట్టాల పంపిణీ ఇలా 1.70 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లోకి ఎలాంటి అవినీతి లేకుండా అందించారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, మాజీ జెడ్పీటీసీ బాలరసింహారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ మహబూబ్ బీ, డ్వాక్రా ఏసీ లావణ్య, ఏపీఎం వెంకటరమణ, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, డ్వాక్రా యానిమేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఖాజీపేట : మండల కేంద్రం ఖాజీపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామం వద్ద గల శ్రీపాద శ్రీ వల్లభ అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో చాపాడు మండలం లక్ష్మీపేట గ్రామానికి చెందిన ఆదిముభేష్‌రెడ్డి చేయూతతో విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు సేవా సమితి వ్యవస్థాపకులు కొండల భరద్వాజ్‌రెడ్డి తెలిపారు.

కంటి జబ్బులను అశ్రద్ధ చేయొద్దు

ప్రొద్దుటూరు క్రైం : కంటి జబ్బులను అశ్రద్ధ చేయొద్దని అభిలాష్ నేత్రవైద్య శాల వైద్యుడు గురు అభిలాష్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని డాక్టర్ గురు అభిలాష్ తెలిపారు. ఆర్టీఓ మురళీధర్‌తో పాటు ఎంవీఐలు వేణు, నారాయణ నాయక్, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రొద్దుటూరు : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీచంద్రోఖర్ తెలిపారు.

సోమవారం మండలంలోని చౌటపల్లె గ్రామంలో ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ సునీత, ప్రిన్సిపాల్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరాముడు, అధ్యాపకులు బాబా ఫక్రుద్దీన్, శ్రీరామ్ నాయక్, దామోదర్ రావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు : దివ్యాంగురాలు మానుకింద దస్తగిరమ్మకు అమృతానగర్‌లో కేటాయించిన స్థలాన్ని ఇవ్వాలని కోరుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి శివకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు పెద్దరాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బత్తల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి స్థలం నాయీబ్రాహ్మణులకు కేటాయింపు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని నాయీబ్రాహ్మణుల కల్యాణ మండపం నిర్మాణం కోసం రూ.కోటికిపైగా విలువైన 33 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విరాళంగా ఇవ్వనున్నారు. చెన్నమరాజుపల్లె రోడ్డులోని ప్రకృతి నగర్‌లో ఈ స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే రాచమల్లుకు మంగళవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు.

నేడు అభినందన సభ

రాజుపాళెం : మండలంలోని నాయీబ్రాహ్మణులంతా మంగళవారం ప్రొద్దుటూరులో జరగబోవు నాయీబ్రాహ్మణుల అభినందన సభకు తరలి రావాలని నాయీబ్రాహ్మణ మండల అధ్యక్షుడు జయరామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్యాణ మండపం నిర్మించుకునేందుకు 33 సెంట్ల స్థలాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఉచితంగా ఇచ్చారని, మండలంలోని నాయీబ్రాహ్మణులంతా వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

హెల్త్‌కార్డులు అందజేత


ఆప్కాస్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులకు సోమవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్వగృహంలో ఆప్కాస్ స్టేట్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందికి హెల్త్‌కార్డులు అందజేయడం సంతోషకరమని, ఈ హెల్త్‌కార్డును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్ర, రాళ్ళపల్లి నరసింహులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కలసపాడు (కాశినాయన) : కాశినాయన మండలంలోని అమగంపల్లె వద్ద ఉన్న బాలమ్మసత్రం వృద్ధాశ్రమంలో సోమవారం 90 మంది వృద్ధులకు పోరుమామిళ్ళలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమస్‌రెడ్డి దంపతులు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రేమదాన్ గృహిణి టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న 15 మంది యువతులకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వారితో పాటు అమెరికా నుండి వచ్చిన దాతలు టామ్, పెట్రీషియా, డేవిడ్, ఎలిజబెత్‌లు హాజరై వారికి దుప్పట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు రెవ. ఫాదర్ దేవరాజు, సిస్టర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో కలకలం రేపిన పోస్టర్లు

ప్రొద్దుటూరు : తెల్లారకు ముందే ప్రొద్దుటూరు పట్టణంలో ఎక్కడ చూసినా టీడీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ అభ్యర్థి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పోస్టర్లు వెలిశాయి. ఇతర టీడీపీ నాయకులందరూ ఈ పోస్టర్లను వేయడాన్ని ఖండించారు.

టికెట్ల కోసం పలువురు నేతల పోటీ..

ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కోసం పలువురు నేతలు పోటీపడుతున్నారు. ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ నాయుడు సోదరుడు సురేష్‌నాయుడు తీవ్రంగా పోటీ పడుతున్నారు. తాము కూడా టికెట్ రేసులో ఉన్నామని ముస్లిం మైనారిటీ నాయకుడు వీఎస్ ముక్తియార్, రాజుపాళెం మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. గత వారంలో జరిగిన కమలాపురం సభకు నాయకులందరూ ఎవరి స్థాయిలో వారు జనాన్ని సమీకరించి తరలించారు. ప్రవీణ్‌కే టికెట్ వస్తుందని కొందరు, చివరలో బీఫాం వరదరాజుల రెడ్డికి ఇస్తారని మరికొందరు బెట్టింగ్‌లు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. పోస్టర్ల వ్యవహారంపై పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. ఈ విషయంపై ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యవహారం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, పోస్టర్లు వేసిన విషయం తనకు తెలియదని అన్నారు.

ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య

బి.కోడూరు : ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మండలంలోని ఐత్రంపేట గ్రామానికి చెందిన గోవిందాయపల్లి కృష్ణయ్య ఎంపికయ్యాడు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ రాష్ట్ర సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియమ నిబంధనలకు కట్టుబడి సంఘం పోరాటంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.